# గిరిజనుల - సంస్కృతి - గిరిజనప్రాంతాల పరిపాలన

'భారతదేశము నామాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.  సుసంపన్నమైన బహువిధమైన నాదేశ వారసత్వాన్ని గౌరవిస్తాను' - ఇలా పాఠశాలస్థాయిలో ప్రతిజ్ఞచేస్తాం.  ఈ వారసత్వంలో గిరిజన సంస్కృతి చాలా ముఖ్యమైనది.  వస్తుమార్పిడి - ఉమ్మడిగా చేసుకొన్న కట్టుబాట్లను - అందరూ పాటించే క్రమశిక్షణ - రాతకోతల జోలికిపోని సరళమైన సంప్రదాయాలు ఈ గిరిజన సంస్కృతి లక్షణాలు.  గిరిజనులున్న ఒకనాటి గణరాజ్యాలుగల కొండప్రాంతాలను భారత రాజ్యాంగం - ఐదు, ఆరవ షెడ్యూలు ప్రకారం పాలించదగిన ప్రాంతాలుగా నిర్ణయించింది.  రాష్ట్రపతి - ఈ ప్రాంతాలు, అందులోగల గిరిజనతెగల పట్టికను ప్రకటిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఒకనాటి హైదరాబాద్‌రాష్ట్రంలో, మద్రాసు ప్రెసిడెన్సీలో గిరిజనసంస్కృతి కనుగుణంగా గిరిజనప్రాంతాల పరిపాలనకు విధివిధానాలను రూపొందించారు.  హైదరాబాదురాష్ట్రంలో గిరిజనపంచాయితీవ్యవస్థకు కొన్ని అధికారాలు కేటాయించారు.  ఆంధ్రప్రాంతంలో 1924 లో రెవిన్యూఅధికారులు, కోర్టులు నిర్వహించవలసిన తీరును - (ఒకే విచారణలో తీర్పు - గ్రామంలో కోర్టు - న్యాయవాదుల ప్రమేయం తక్కువ) రూపొందించారు.  ఇపుడు రాష్ట్రంలోని గిరిజనప్రాంతాలలో, శిక్షాస్మృతిని న్యాయస్థానాలు - సివిల్ చట్టాలను జిల్లాకలెక్టర్, ప్రాజెక్టుఅధికారులు, భూవివాదాలకు సంబంధించిన స్పెషల్‌డ్యూటీ కలెక్టరు - వీరు పాటించి తీర్పులిస్తున్నారు.  సాధారణకోర్టుల పరిధిలోకి సివిల్‌కేసులు రావని సుప్రీంకోర్టు స్పష్టంచేసినప్పటికి కొన్నిచోట్ల ఈ కేసుల విచారణను స్వీకరిస్తున్నారు.

గిరిజనప్రాంతాలలో పంచాయితీరాజ్‌చట్టం పంచాయితీరాజ్‌సంస్థలను గ్రామసభలు/పంచాయితీలు/మండలప్రజాప్రతినిధులు 'స్థానికప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, సామాజిక వనరులు, వారి ఆచారములను అనుసరించి వివాదములను పరిష్కరించుటకు మరియు చిన్నతరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యము, మున్నగు విషయములలో గ్రామసభ మరియు గ్రామ పంచాయతీలకు విశేష అధికారములు కల్పించినది.' (జి.వో.ఎం.లో నెం. 66 ది.24-03-2011)  అంతేకాక "ఈ నిబంధనలలో (చట్టంతాలూకు) ఉపయోగించి నిర్వహించని పదజాలాలకు, నిర్వహించిన మాటలకు, గనులు ఖనిజాల (క్రమబద్ధీకరణ అభివృద్ధి) చట్టము, 1957; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూ బదిలీ నిబంధనావళి, 1959; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల వడ్డీ వ్యాపారస్తుల నియంత్రణ నిబంధనావళి, 1960; ఆంధ్రప్రదేశ్ గిరిజన ఋణ విమోచన నిబంధనావళి, 1960; ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తుల, పశుగణం) చట్టం, 1966; ఆంధ్రప్రదేశ్ అటవీచట్టం, 1967; ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం, 1968; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల చిన్నతరహా అటవీ ఉత్పత్తుల వర్తకం క్రమబద్ధీకరణ నిబంధనావళి, 1979; ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1998; ఆంధ్రప్రదేశ్ వ్యవసాయదారులచే నిర్వహించే సాగునీటి వ్యవస్థల యాజమాన్య చట్టం, 1997; షెడ్యూల్డు తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 లేదా ఏదేని ఇతర అట్టి చట్టంలో వాటికి నిర్వచించిన అర్థమే కలిగిఉంటుంది' అనికూడా స్పష్టంచేసి ఆయా అంచెలలోని (గ్రామసభ వగైరా) ఈ చట్టాలకు సంబంధించిన ప్రతిపాదనలు, లబ్ధిదారుల ఎంపికచేసి, ఆయా అధికారులను ఉత్తర్వులకోసం పంపే అవకాశం ఇచ్చారు.  కాబట్టి గ్రామంలో ఐకమత్యంతోపాటు, గ్రామసభ అమలుచేయగల అవకాశాలపట్ల అవగాహనగల పంచాయితీరాజ్ సంస్థలే తమ అధికారాలను సక్రమంగా ఉపయోగించుకొని బాధ్యతలను నిర్వహించుకోగలవు.

తెగల ధ్రువపత్రాల జారీకోసం, గిరిజనప్రాంతాలలో సంప్రదాయాలను ప్రభుత్వం అధికారులకోసం సూచనలరూపంలో జారీచేసింది.  వీటిప్రకారం ప్రాథమిక విచారణ జరిపే అవకాశం పైన పేర్కొన్న జి.వో. 66 లో పేర్కొనలేదు.  పంచాయితీలోగల గ్రామాలను - రెండు, మూడు యూనిట్లుగాచేసి గ్రామసభలను ఏర్పరుస్తూ  ఓ అవకాశం ఈ చట్టంలోఉండగా, అటవీహక్కుల గుర్తింపు చట్టం - గూడెంవారీగా గ్రామసభ - గూడెం సరిహద్దులు - వాటిలోగల వనరుల సంప్రదాయ వినియోగం గూడెంసభకి వదిలేసింది.  వీటికి సంబంధించి హక్కులను రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ అధ్యక్షతనగల కమిటీ, జిల్లాకలెక్టర్ అధ్యక్షతనగల కమిటీకి సిఫార్స్ చేస్తుంది.  వారు హక్కుపత్రాలు జారీచేస్తారు.  ఏమైనా తగవులుంటే తీరుస్తారు.

స్థూలంగా గిరిజనప్రాంతంపాలన పూర్వాపరాలివికాగా, షెడ్యూల్డుజాతుల, తెగల అత్యాచారనిరోధకం చట్టం వంటివాటినికూడా కూడా అర్థంచేసుకోవటం అవసరం. ఈ చట్టం ప్రకారం బాధితులేకాక, స్వచ్ఛందసంస్థలుకూడా, బాధితులకు న్యాయసహాయంతోపాటు, ఇతర సహాయాలు అందించే అవకాశాన్ని ఇచ్చింది.

ఆదిలాబాద్ గిరిజనప్రాంతంలో సంప్రదాయ గ్రామసభలు – రాయ్‌సెంటర్లున్నాయి. చట్టంప్రకారం గ్రామసభల ఏర్పాటుకూడ జరిగింది. గిరిజనులలోకూడా విద్యావంతుల సంఖ్య పెరుగుతుంది. వీరందరూ తమ సంస్కృతులలోగల పటిష్ఠతను – చట్టాలిచ్చిన అవకాశాలను అర్థంచేసుకొని తమ సమాజానికి ఉపయోగపడాలని ఈ సదస్సు ఆశిస్తున్నది. తెలిసినవాడే – ముందుకు నడిపిస్తాడు (Who knows, he leads).